హృదంతరాళం

జంపని రామమోహనరావు

ఆనాడు తిరుమలరావుకు కొంచెం గూడా శాంతి లేదు.

అర్ధరాత్రి సమయం; తిరుమలరావుకు ఇంట్లో నిద్రపట్టక మంచంమీదనుండి లేచి వచ్చి, పెరట్లో జాజిపందిరి ప్రక్కన 'రోలు' మీద కూర్చున్నాడు—కాళ్ళమీద మోచేతులానించి, అరచేతుల మధ్య తలను పటుకుని.

ఆకాశంలో తెల్లని, చల్లని వెన్నెల జల్లులు కురిపిస్తున్నాడు జాబిల్లి. జాజి పందిరిమీద విరబూసిన పువ్వులు హాయి గొలిపే పరిమళాలు వెదజల్లుతున్నాయి.

ఆవేవీగూడా తిరుమలరావుకు లేశమాత్రమూ ఉపశమనం కలిగింపజాలక పోతున్నాయి.

అరచేతులమధ్య ఎంతగట్టిగా నొక్కేస్తున్నా బ్రద్దలయేటట్లుగానే ఉంది శిరస్సు. తీవ్రమైన సంఘర్షణలో సతమతమవుతోంది మనస్సు. ఆ మనస్సులో పెనుభూతంలా ఒకప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానమేమిటి? తేలటంలేదు.

గతం, వర్తమానం, భవిష్యత్తు—మూడూ కన్నులముందు నిలబడి వెక్కిరిస్తున్న భ్రాంతి కలుగుతోంది.

గతం—

సంవత్సరం క్రితం జరిగిన సంఘటన ఒకటి పదిరోజుల్నుంచీ ముల్లులా పొడుస్తోంది తనను!

అత్తగారింటినుంచి చుట్టపు చూపుగా వచ్చింది పెద్దకూతురు సరోజ ఆమె రాకకు ఇంట్లో అందరూ సంతోషించారు ఆదివారం కావటంవల్ల, ఇంట్లో అందరూ కలిసి మాట్నీషోకు వెళ్ళారు. సాయంకాలం వచ్చేశాక, ఎవరిపనుల్లో వారుండగా, తను డ్రాయింగ్ రూంలో కూర్చుని ఏదో వ్రాసుకుంటూండగా సరోజ తన దగ్గరకు వచ్చింది

"రామ్మా కూర్చో"

"మిమ్మల్నొక సహాయం అడగాలని వచ్చాను నాన్నగారూ"

"అడుగమ్మా"

"తప్పకుండా చేస్తారు కదూ"

"పిచ్చిదానా! ప్రతిదీ సందేహమే అయితే ఎలా? నీకు సహాయపడటానికి నేను వెనుకాడతానా? అడుగు ఏమిటది?"

"మీ అల్లుడిగారి చిన్నతమ్ముడు హరి తెలుసుగదా బి ఏ పాసై మూడేళ్ళయింది ఇంతవరకు ఉద్యోగం రాలేదు ఉద్యోగం రాలేదన్న బాధకు తోడు ఇంత వయసొచ్చి, ఇంకా అన్నగారిమీదే ఆధారపడి బ్రతుకుతున్నాననే దిగులుకూడా అతనిలో ఉన్నట్లుంది మేం అతణ్ణి బాగానే చూసుకుంటున్నాం అయినా ఎప్పుడూ తనలో తనే ఏదో మధనపడుతూ బాధపడుతుంటాడు సరిగ్గా ఇంటిపట్టున ఉండడు రాత్రుళ్ళు తరచూ భోజనం మానేస్తుంటాడు. తన చేతగాని తనాన్ని పదింతలుగా ఊహించుకుని కుమిలిపోతుంటాడు దిగులుతో చిక్కి సగమయాడు అతని పరిస్థితి మేం చూడలేకపోతున్నాం. ఇంకా కొంతకాలం ఇలానే ఉద్యోగం లేకుండా ఉంటే, అసలు ఇల్లు వదలిపెట్టి ఎటైనా వెళ్ళిపోతాడేమోనని మీ అల్లుడుగారు భయపడుతున్నారు—" చెప్పటం ఆపి, తన ముఖంలోకి చూచింది సరోజ

"చెప్పమ్మా వింటున్నాను" అన్నాడు తను

"హరికిప్పుడు ఉద్యోగం కావాలి నాన్నగారూ వీలైనంత తొందరలో ఉద్యోగం దొరికితేగాని అతడు మళ్ళీ మామూలు మనిషికాడు"

తనలో సన్నగా కల్లోలం మొదలయింది సరోజ ఏం అడగాలనుకుంటుందో తన ఊహకు అందుతూనే ఉంది. ఆ ఊహనుసైతం భరించలేక పోతున్నాడు తను!

"నాన్నగారూ! ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"ఈ విషయాన్నిగురించేనమ్మా"

ఆ మాటల్ని అనుకూలంగా అర్థం చేసుకున్న సరోజ ముఖం వికసించింది.



"నాకు తెలుసు నాన్నగారూ! మీరు నా 'మాట' కాదనరు."

"ఇంతకూ ఆ 'మాటే'మిటో చెప్పు"

"ఇంకా చెప్పటానికేముంది?. మీరు ఊహించారనుకుంటాను హరికి ఉద్యోగం కావాలి మీ ఆఫీసులో ఖాళీలున్నాయట గదా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజినుంచి హరికి కాల్ లెటర్ వచ్చింది"

"మంచిదేగదమ్మా"— అంతరంగంలో విజృంభిస్తున్న తుఫానును ప్రయత్నంమీద అణచివేస్తూ, పైకి మామూలుగా, ఏ భావమూ వ్యక్తపరచకుండా అన్నాడు తను — సిగరెట్ తీసి అందిస్తూ అప్పటికి తనొక నిర్ణయానికి వచ్చేశాడు.

తన నిర్లక్ష్యవైఖరిని చూచేసరికి సరోజ ముఖం అవమానంతో ఎర్రబడింది. కొంచెం గట్టిగా అన్నది.

మంచిజరగాలనే నాన్నగారూ నాకోర్కె. ఆ ఉద్యోగం హరికి ఇచ్చేయాలి మీరు"

"అర్హతలు ఉంటే ఇవ్వక తప్పదు గదమ్మా"

రోషంతో తలెగరేసింది సరోజ

"అంతేగాని మీరేం సహాయం చెయ్యనంటారు"

"ఆవేశం వద్దు సరోజా మామూలుగా ఆలోచించు నా తత్వమెలాంటిదో నీకు తెలియంది కాదు అర్హతలు ఉన్నవాళ్ళను కాదని, అర్హతలు లేనివాళ్ళకు ఉద్యోగాలివ్వటం క్లాస్‌వన్ ద్రోహం ఆఫీసర్నైనందుకు అధికారంతోపాటు బాధ్యతలు కూడా ఉన్నాయి ఆత్మవంచన చేసుకోమని నీ తండ్రిని బలవంత పెట్టకు"

"ఇంత గడ్డుపరిస్థితుల్లో ఉన్నప్పుడు గూడా, అవకాశం ఉండిగూడా, ఆదు

కోకపోతే మీ అల్లుళుగారు నన్నెంతగా అసహ్యించుకుంటారో ఆలోచించండి నాన్నా"

"నాకు తెలుసమ్మా కానీ, నేనేం చేయలేను"

"అంతే? నేనెంత చులకనైపోయినా మీకు ఫర్వాలేదు. నా మనస్సెంత కష్ట పెట్టుకున్నా మీకు బాధలేదు నా కోసం ఈ మాత్రం సహాయం కూడా చెయ్యరు! ఇంతేనా నేనంటే మీకున్న ప్రేమ?"

"సరోజా!"అరిచాడు తను. "అనవసరంగా నోరు పారేసుకోకు"—ఏదో అనబోయి, అనకుండా తమాయించుకుని నిగిరెట్టు విసిరి నేలకేసి కొట్టి, చరచరా బయటకు వెళ్ళిపోయాడు తను!

మర్నాడు ప్రొద్దున్నే వెళ్ళిపోయింది సరోజ!—

'రోలు' మీదనుండి లేచాడు తిరుమలరావు విపరీతమైన ఘర్షణతో తల తిరుగుతున్నట్లుగా ఉంది మెల్లగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి నడిచాడు రెండు గ్లాసులు మంచినీళ్ళు త్రాగి, వెళ్ళి మంచంమీద పడుకున్నాడు మంచం అంపశయ్యలా ఉంది

తను మొదట్లో చిన్న ఉద్యోగంలో చేరి స్వశక్తితో పైకి వచ్చాడు చాలా కాలం హెడ్‌క్లర్కుగా పనిచేశాడు రిటైరు కాబోయేముందు రెండు సంవత్సరాలు మాత్రమే ఆఫీసరుగా చేశాడు.

ఉద్యోగంనుంచి రిటైరై ఏడాదయింది. వచ్చిన ప్రావిడెంట్‌ఫండ్‌తో అప్పుడే నాలుగో కూతురు ప్రభావతి పెళ్ళిచేశాడు. ఇప్పుడిక మూడోవాడు కమలాకరం, ఐదో కూతురు ఉమ, మిగిలి ఉన్నారు.

చేతిలో ఉన్న డబ్బంతా కూతురు పెళ్ళికే అయిపోయింది ఇప్పుడుకుటుంబం గడవటమే చాలా కష్టంగా ఉంది. ఎన్నో బాధలు భరించవలసి వస్తోంది. బాధలు భరిస్తున్నది తనొక్కడేకాదు. నిరుద్యోగిగా మనోవ్యథ ననుభవించే కమలాకరం, ఇరవయ్యేళ్ళు నిండి, ఇంకా అవివాహితగా మిగిలిఉన్న ఉమ, వీళ్ళిద్దర్నీ చూచి కుమిలి కుమిలి రోధించే ఇల్లాలు రుక్మి !

వీళ్ళందరికీ తనేం సమాధానం చెప్పాలి?

మంచంమీదనుండి లేచాడు తిరుమలరావు కళ్ళు మూసుకోగానే మంటలు రగులుతున్నాయి! దారిద్ర్యం అతి భయంకరమైంది దానిని ఈ వయస్సులో ఇప్పుడే అనుభవిస్తున్నాడు తిరుమలరావు ఒకనాడు పరుగెత్తకుండానే పాలు త్రాగిన చోట, ఈనాడు పరుగెత్తి నీళ్ళు త్రాగుదామన్నా లేవు! ఒకనాడు పూలమ్మిన చోట ఈ నాడు అమ్ముకొనటానికి కట్టెపుల్లలు సైతం లేవు!

అసహనంగా గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు తిరుమలరావు.

హృదయంలో దావానలం ప్రజ్వరిల్లు తోంది!

పదిరోజులక్రితం—

ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసునుండి కాల్ లెటర్ వచ్చింది కమలాకరంకు. తాను పనిచేసి రిటైరైన ఆఫీసులోనే క్లర్కు పోస్టుకొక వేకెన్సీ వచ్చిందట!

'కాల్ లెటర్' తీసుకొచ్చి, ఇంట్లో అందరికీ చూపించి, ఆనందం పట్టలేక గంతులేశాడు కమలాకరం. రుక్మిణి సంతోషానికి పట్టుపగ్గాల్లేవు. చాలా కాలం తర్వాత ఇంట్లో మళ్ళీ జీవకళ వచ్చింది.

కానీ, తనకు మాత్రం లేశమాత్రమూ ఆనందం కలగలేదు. బియ్యే పార్టుల వారీ పాసైనవాడికి ఉద్యోగం వస్తుందా? ఇంటర్వ్యూలో సెలక్టవు తాడా?

"మన కష్టాలిక కడతేరాయి నాన్న గారూ," అన్నాడు కమలాకరం తన దగ్గరగావచ్చి.

"అదే జరిగితే ఇంక కావలసిందే ముందిరా! కానీ—"

"కానీ—? ఏమిటి నాన్నగారూ? చెప్పండి."

"ఆ ఉద్యోగం మనకు రావొద్దురా?"

కమలాకరం నవ్వి అన్నాడు. "మీ కన్నీ అనుమానాలే నాన్నగారూ. మీరు అడగాలేగానీ, వెంకటరత్నంగారు కాదంటారా?"

కట్టె అయ్యాడు తను!

తను ఆఫీసరుగా ఉన్న రోజుల్లో వెంకటరత్నం హెడ్‌క్లర్కు. తనంటే అతనికెంతో గౌరవం. తనను గురువులా భావించేవాడు. తను రిటైరయాక ప్రమోషన్‌మీద ఆఫీసరయ్యాడు.

తనకు కొన్ని ప్రిన్సిపుల్స్ ఉన్నాయి! జీవితంలో ఇంతవరకూ ఆ ప్రిన్సిపుల్స్‌కు లోబడే ప్రవర్తిస్తూ వచ్చాడు. కాలం తనకెన్నో అగ్ని పరీక్షలు పెట్టింది. అన్నింటికీ తట్టుకుని మేరువులా నిలబడ్డాడు. ఈనాడు— ఈనాడు ఓడిపోక తప్పదా?

"ఏమిటి నాన్నగారూ ఆలోచిస్తు న్నారు?" తన ముఖంలోని భావాలను చదువుతూ ప్రశ్నించాడు కమల్.

"ఏం—లేదురా." తన కలవరపాటు తనకే వినిపించింది స్పష్టంగా.

"ఉద్యోగంకోసం వెంకటరత్నం గారిని ఎలా అడగాలని ఆలోచిస్తు న్నారా?" అనునయంగా అడిగాడు కమలాకరం.

వాడి కంఠంలోని మృదుత్వానికి తను పొంగిపోయి, ఆత్రంగా అన్నాడు. "సరిగ్గా ఊహించావు కమల్! నే నెలాంటివాడినో నీకు తెలియందికాదు. ఇన్నాళ్ళనుండీ నమ్ముకున్న ధర్మాన్ని ఈనాడు నరికివేయలేను. బొందిలో ప్రాణమున్నంతవరకూ మనస్సును చంపుకోలేను. నేనేం చేయలేను. సారీ. ఎక్స్‌ట్రీమ్లీ సారీ!"

"సారీ కాదు నాన్నగారూ సారో! ఇప్పుడు మన కుటుంబ పరిస్థితి పుల్లాప్ సారో! ఇక్కడ 'సారీ'లకు తావులేదు."

"కమల్! నా మాట—"

"వినను మీరే ఆలోచించుకుని తేల్చుకోండి. మీ కొడుక్కు ఉద్యోగం వచ్చి, మీ కూతురుకి పెళ్ళియోగం కలిగి, అందరూ హాయిగా బ్రతకాలనుకుంటారో అలాకాక అందరూ దుర్భరదారిద్ర్యంలో మగ్గుతూ అతిహీనమైన బ్రతుకు బ్రతకాలనుకుంటారో తేల్చుకోండి"— కరకుగా అనేసి, గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు కమలాకరం.

తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు తను

క్షణంలో శరీరాన్ని విపరీతమైన నిస్సత్తువ ఆవహించింది కన్నులముందు చీకట్లు క్రమ్మినట్లు భ్రాంతి కలిగింది.

ఈ సవాల్‌ను ఏవిధంగా ఎదుర్కోవాలి!

కమల్ వెళ్ళి తానలా అన్నట్లు తల్లితో చెప్పానట్లుంది— రుక్మిణి నెత్తీ నోరూ మొత్తుకుంటూ తన దగ్గరకు వచ్చింది—

ఈ పదిరోజులనుంచీ తనకు అందరూ అనేక రకాలుగా చెప్తున్నారు. తను వింటున్నాడు— అంతర్గతంగా చెలరేగే అలజడిని ప్రయత్నంమీద నిబ్బరించుకుంటూ!

రేపే ఇంటర్వ్యూ.

ఈ రాత్రి పోయి కొద్దిగంటల్లో తెల్లవారుతుంది

తనేం చేయాలి!

* * *

ఉదయం తొమ్మిది గంటలవుతోంది. ఇంట్లో అందరూ నిరుత్సాహంగా ఉన్నారు. అందరికీ తిరుమలతావుమీద పట్టలేనంత కోపంగా ఉంది నోటివరకూ వచ్చిన ముద్ద జారి నేలమీద పడుతున్నదనే గుబులు అందరినీ క్రుంగదీస్తోంది

ఇంటర్వ్యూకి వెళ్ళవలసిన కమలాకరంలో ఆ ఉత్సాహమే లేదు నిరాసక్తంగా, నిస్తేజంగా ఉండిపోయాడు.

మానవుడు తన జీవిత పోరాటంలో తనకు సహాయపడటానికి ప్రక్కనుండి ఎవరో వస్తారనీ, ఆ సహాయం వస్తే తాను తప్పకుండా విజయం సాధిస్తాననీ నమ్మకం పెట్టుకోవటమే జరిగితే- తీరా అవసరానికి ఆ సహాయం అందకపోయిందా! ఆ కలవరంలో తన స్వశక్తి మీద కూడా నమ్మకం చచ్చిపోయి నిర్వీర్యుడై పోతాడు

కమలాకరం ఆ స్థితిలోనే ఉన్నాడు.

"బాబూ! టైమవుతోంది వెళ్ళవూ!" రుక్మిణి ఉండబట్టలేక అడిగింది.

"వెళ్ళినా వెళ్ళకపోయినా ఒకటే నమ్మా ఇంతకుముందు ఎన్నిసార్లు వెళ్ళలేదు! ఏం జరిగింది?"

"అలా అంటే ఎట్లారా? ఏ పుట్టలో ఏ పాముందో!"

"ఏదో ఒకపాము ప్రతి పుట్టలోనూ ఉంటుందమ్మా. ఎటొచ్చీ పామును పట్టుకోవటానికి మనదగ్గర 'నాదస్వర' మనేది ఒకటుండాలి. అది లేనప్పుడు పుట్టదగ్గర కెళ్ళటమెందుకూ ?"

అతడికేం సమాధానం చెప్పాలో తోచలేదు రుక్మిణికి. 'ఖర్మ' అని తల కొట్టుకుంటూ ప్రక్కకు వెళ్ళిపోయింది.

ప్రక్క గదిలోంచి అంతా వింటూనే ఉన్నాడు తిరుమలరావు.

ప్రొద్దుటినుండీ అంతా గమనిస్తూనే ఉన్నాడు.

"కమలాకరం ! ఇలారా." కేక వేశాడు తిరుమలరావు.

కమలాకరం వచ్చాడు.

"త్వరగా తయారై ఆఫీసుకు పద. నేనూ వస్తున్నాను. వెంకటరత్నాన్ని కలుస్తాను."

ఆ ఒక్కమాటతో ఆ యింట్లో వాతావరణం మారిపోయింది.

హఠాత్తుగా వసంతం వచ్చేసినట్లయింది.

ఆ మార్పుకు మనస్సోకింత తేలిక పడగా తాను తీసుకున్న నిర్ణయాన్ని మరొకసారి నెమరువేసుకున్నాడు తిరుమలరావు.

"కాలే కడుపుతో ఏ మానవుడూ దేశభక్తుడు కాలేడు !-ఇది జగమెరిగిన సత్యం. ఆకలితో మాడే మనిషికి తక్షణం కావలసింది ఆహారం. అంతే కానీ ధర్మపనాలుకావు. నీతులు, న్యాయాలు, ధర్మాలు, అన్నీకూడా కడుపునిండాక కావలసినవి. ఆకలి తీరాక ఆలోచించవలసినవి. మంచి చేయాలనే ఆశయంతో తనను తాను వంచన చేసుకోవటం అవివేకం.

ఆదర్శాలుండటం మంచిదే. కానీ అవి ఎంతవరకుండాలి ?

'నువ్వు రాచమార్గంలోనే వెళుతున్నావు సందులు గొందులు తిరగటం నీ ఉద్దేశం కాదు. రాచమార్గంనుండి ప్రక్కలకు దిగగూడదనే నడుస్తున్నావు. నీ ఆశయం గొప్పదే. కానీ ఎదురుగా పులి వస్తుందనుకో. పులిని చంపే శక్తి నీ దగ్గర లేదనుకో. పిక్కబలం చూపి ప్రక్క సందుల్లోకి పరుగెత్తక ఏంచేస్తావోయ్ ప్రియ మిత్రుడా ?'

జీవితం బహు విచిత్రమైనది.

ఎక్కడ, ఎప్పుడు, ఏ క్షణంలో, ఏ పులి గాండ్రిస్తూ ఎదురు వస్తుందో, ఎటునుండి ఏ పాము బుసలుకొడుతూ పైన బడుతుందో ముందుగా తెలీదు. తెలిశాక వెంటనే ఆత్మరక్షణకోసం మార్గం ఆలోచించుకోక తప్పదు."

"తప్పదు!"--అనుకుంటూ ఎందుకో కళ్ళు ఒత్తుకున్నాడు తిరుమలరావు పది గంటల ప్రాంతంలో ఆఫీసుకు చేరుకున్నాడు తిరుమలరావు. అక్కడ ఉద్యోగార్థులు చాలామంది ఉన్నారు. అందరి ముఖాల్లోనూ భవి

వ్యక్తిమీద ఆశ ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. కన్నుల్లో 'నేటి' చీకట్లను పటాపంచలు చేసే కాంతి కిరణాలను 'రేపు' తెస్తుందనే నమ్మకం తొంగిచూస్తోంది! వాళ్ళందర్నీ చూచేసరికి తిరుమలరావుకు తన హృదయాన్నెవరో పిండినట్లయింది.

ఎంతమంది యువకులిలా జీవనాధారంకోసం అల్లాడిపోతున్నారు! ఆ నవ్వే ముఖాలవెనుక ఎన్ని కుటుంబాల కన్నీటి కథలున్నాయి!

మనస్సంచలాన్ని అణచివేస్తూ లోపలికి నడిచాడు తిరుమలరావు.

"లొంగిపోకూడదు. గుండె రాయి చేసుకోవాలి" అనుకున్నాడు.

నమస్కారం చేసిన ఆఫీసుప్యూనకు ప్రతినమస్కారంచేసి, ఆఫీసరు గదిలోకి నడిచాడు.

నమస్కార ప్రతి నమస్కారాలయాయి.

తిరుమలరావు రాక వెంకటరత్నంకు ఆనందం కలిగించింది.

ప్యూనుచేత కాఫీ తెప్పించాడు వెంకటరత్నం.

తిరుమలరావు ఆరోగ్యాన్ని గురించీ పిల్లల్నిగురించీ మంచిచెడ్డలు విచారించాడు వెంకటరత్నం.

ఏదో చెప్తున్నాడనేగానీ తిరుమలరావు మనస్సు మనసులోలేదు. ఏదో దుస్సహమైన సంచలనం! మోయలేని వేదన! కనుపించని బడబాగ్ని ఆయనలో కల్లోలాన్ని సృజించాయి.

అన్నీ ప్రశ్నలే. వెక్కిరించే ప్రశ్నలు లెక్కలేనన్ని ప్రశ్నలు.

"ఇంతకూ మీరు వచ్చిన పనేమిటో చెప్పారుకారు." అన్నాడు వెంకటరత్నం కాఫీ త్రాగటం ముగిశాక.

ఏదో చెప్పబోయాడు తిరుమలరావు. కానీ, గొంతుకలో ఏదో అడ్డుపడినట్లయి మాట పెగల్లేదు. సూటిగా వెంకటరత్నం ముఖంలోకి చూడలేక తల దించుకున్నాడు గానీ తలదించుకోవటాన్ని సహించలేక వెంటనే తలెత్తి అన్నాడు.

"స్వంత పనిమీద ఈ వైపుకు వచ్చాను. ఎలాను వచ్చానుగదా మిమ్మల్ని కలిసిపోదామని ఇలా వచ్చాను. దట్సాల్. వేరే పనంటూ ఏమీ లే...దు! ఓకె. మళ్ళీ కలుద్దాం."

అనేసి, కన్నుల్లో ఉబుకుతున్న అశ్రువుల్ని వెంకటరత్నంకు చూపించలేక చటుక్కున లేచి, చరచరా బయటకు నడిచాడు తిరుమలరావు.

తిరుమలరావలా హఠాత్తుగా లేచిపోవటం చూచి తెల్లబోయాడు, వెంకటరత్నం.

"అసమర్థుణ్ణి! నేను అ..స..మ..ర్థు..ణ్ణి!" గొణుక్కున్నాడు తిరుమలరావు ఆఫీసు మెట్లుదిగుతూ.